ఘనంగా ధ్వజారోహణం
2





2
కలప తరలిస్తున్న వాహనం సీజ్

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య డిమాండ్ చేశారు. ఆర్మూర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. కొనుగోళ్లలో జాప్యంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దాసు మాట్లాడుతూ.. ఇటీవల వానలకు తడిసిన వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని ఆయన అధికారులను కోరారు.





## ప్రాజెక్టులకు భారీ వరద..

**అక్షరటుడే, మెండోరా/ఎల్లారెడ్డి :** శ్రీరాంసాగర్‌కు ఎగువ నుంచి వరద పోటెత్తుతోంది. దీంతో అధికారులు బుధవారం ఉదయం పదహారు వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటి విడుదలను ప్రారంభించారు. జలాశయంలోకి ప్రస్తుతం 59,654 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో అంతే మొత్తంలో దిగువకు వదులుతున్నారు. ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మి కాలువకు 200, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జలాశయం నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం అంతేస్థాయిలో నీరు నిల్వ ఉంది.

### నిజాంసాగర్‌కు పెరుగుతున్న ఇన్‌ఫ్లో..

నిజాంసాగర్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పెరిగింది. జలాశయంలోకి ప్రస్తుతం 9,570 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అధికారులు రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. అంతేస్థాయిలో నీరు నిల్వ ఉంది. కాగా.. ఎగువన సింగూరుకు సైతం వరద భారీగా వస్తోంది.

## మానవత్వం చాటుకున్న నాగిరెడ్డిపేట ఎస్సై



**అక్షరటుడే, ఎల్లారెడ్డి;** ఆపదలో ఉన్న వ్యక్తికి ఆపన్నహస్తం అందించి మానవతా దృక్పథం చాటుకున్నారు నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్ గౌడ్. పట్టణంలోని దేవనపల్లి గేట్ సమీపంలో బుధవారం సాయంత్రం బైక్ అదుపుతప్పి ఒ వ్యక్తి కిందపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో గమనించిన ఎస్సై భార్గవ్ గౌడ్ వెంటనే పోలీస్ వాహనంలో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో ఆస్పత్రికి చేర్చడంతో బాధితుడికి ప్రాణాపాయం తప్పింది. ఉదయం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. తిరిగి నాగిరెడ్డిపేట వెళ్తున్న క్రమంలో తన కళ్లెదుటే వ్యక్తి గాయపడడంతో, తనవంతుగా స్పందించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎస్సై మానవతా దృక్పథానికి పలువురు అభినందించారు.

## భారీ వరద.. బాబ్లీ గేట్లు మూయని అధికారులు



**అక్షరటుడే, బాల్కొండ:** శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువన ఉన్న బాబ్లీ గేట్లను సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రతి ఏడాది అక్టోబర్ 28వ తేదీ అర్ధరాత్రి మూసివేయాల్సి ఉంటుంది. ఈ మేరకు తెలంగాణ, మహారాష్ట్ర అధికారులు కలిసి ప్రాజెక్టు గేట్లను మూసివేస్తుంటారు. రాష్ట్రాలకు నీటి విభజనలో తేడా రాకుండా సుప్రీంకోర్టు ఈ నిబంధన విధించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బాబ్లీ గేట్లు అక్టోబర్ 28న మూసివేయాల్సి ఉంది. అధికారులు సైతం 29వ తేదీ ఉదయమే బాబ్లీ వద్దకు చేరుకున్నారు. కానీ ఎగువ నుంచి భారీ ఇన్‌ఫ్లో ఉండడంతో ఇరురాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులు చర్చించుకున్నారు. అనంతరం నాలుగు గేట్లను పూర్తిగా ఎత్తి.. మిగిలిన గేట్లను కొద్దిమేర కిందికి దించారు. కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఎస్ఈ జగదీష్, సీడబ్ల్యూసీ ఈఈ ఫ్రాంక్లిన్, నాందేడ్ ఈఈ బన్సాద్, ఎస్సారెస్పీ ఏఈఈ కొత్త రవి పాల్గొన్నారు.

పోలీసు శాఖలో స్పెషల్ బ్రాంచ్ కీలకమైనది. ఇందులో పనిచేసే అధికారులు జాగ్రత్తగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ముఖ్యమైన కేసుల పరిశీలనను ప్రభుత్వం వీరికే అప్పగిస్తుంటుంది. ముఖ్యంగా పాస్ పోర్టు విచారణ వీరే చూస్తారు. అయితే కొంతమంది అధికారుల నిర్లక్ష్యంతో కేసులు ఉన్నా పలువురు యథేచ్ఛగా పాస్ పోర్టులు పొందుతున్నారు. ఎలాంటి పరిశీలన లేకుండానే కొందరు సిబ్బంది పాస్‌పోర్టులకు క్లియరెన్స్ ఇస్తున్నారు. ఇలాంటి వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆరు నెలల కాలంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు ఎస్బీ సిబ్బందిని సస్పెండ్ చేశారు.

-అక్షరటుడే, కామారెడ్డి

# పాస్‌పోర్టుల జారీలో నిర్లక్ష్యం..!



- విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్న పలువురు ఎస్బీ పోలీసులు
- పరిశీలన లేకుండానే క్లియరెన్స్
- చర్యలు తీసుకుంటున్న ఉన్నతాధికారులు

పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సేకరించి నివేదిక ఇవ్వడం స్పెషల్ బ్రాంచ్ పోలీసుల పని. అయితే కొంతమంది ఎస్బీ సిబ్బంది సరైన విచారణ చేయకుండానే పాస్ పోర్టు ఇవ్వవచ్చని నివేదికలు అందిస్తున్నారు. నూతన పాస్‌పోర్టు, రెన్యూవల్ కోసం పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలి. సంబంధిత ప్రాంత వారిని విచారించి అన్ని పరిశీలన చేశాకే నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. అయితే అలాంటిది ఏమి లేకుండానే నివేదిక ఇవ్వడంతో పాస్‌పోర్టులు జారీ అవుతున్నాయి.

### పాస్‌పోర్టు విచారణ ఇలా..

విద్య, ఉపాధి నిమిత్తం అనేక మంది విదేశాలకు వెళ్తుంటారు. వారు పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకుంటారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత పోలీస్ వెరిఫికేషన్ చేయాల్సి ఉంటుంది. ఫైల్ ఎస్బీ వద్దకు రాగానే దరఖాస్తుదారునికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరించాలి. దరఖాస్తుదారుడు ఉంటున్న ప్రాంతంలో అతని గురించి విచారణ జరపాలి. ఏమైనా కేసులు ఉన్నాయా.. ఇతరత్రా వివరాలు తెలుసుకోవాలి. దరఖాస్తుదారుడికి క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ లేకపోతే పాస్‌పోర్టు ఇవ్వడానికి ఎలాంటి అభ్యంతరం లేదని క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే కొందరు సిబ్బంది ఇవేమీ పట్టించుకోకుండా క్లియరెన్స్ ఇస్తున్నారు.

### ఒకే వ్యక్తికి రెండు పాస్‌పోర్టులు

ఆరు నెలల క్రితం శంషాబాద్ ఎయిర్ పోర్టులో టేకుల రాజయ్య అనే వ్యక్తికి రెండు పాస్ పోర్టులు ఉన్నట్టుగా కేసు నమోదైంది. టేకుల రాజయ్య పాస్‌పోర్టు రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకోగా పోలీసులు ప్రాథమిక విచారణ లేకుండానే క్లియరెన్స్ ఇచ్చారు. రాజయ్యకు రాజు పేరు మీద మరొక పాస్‌పోర్టు ఉన్న విషయాన్ని సంబంధిత విచారణ అధికారి గుర్తించలేదు. దాంతో అతనికి రాజయ్య పేరుమీద మరొక పాస్ పోర్టు లభించింది. ఈ విషయాన్ని గుర్తించిన ఎయిర్ పోర్టు సిబ్బంది అతనిపై కేసు నమోదు చేశారు.

### ఆరు నెలల్లో ముగ్గురిపై వేటు

జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర బాధ్యతలు చేపట్టిన తర్వాత విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి పాల్పడుతున్న సిబ్బందిపై కొరడా ఝులిపిస్తున్నారు. ఆరు నెలల కాలంలో ముగ్గురు ఎస్బీ పోలీసులపై ఆయన వేటు వేశారు. టేకుల రాజయ్య పేరుమీద మరొక పాస్ పోర్టు ఉందన్న విషయాన్ని గుర్తించకుండా క్లియరెన్స్ ఇచ్చిన ఎస్బీ హెడ్ కానిస్టేబుల్ కృష్ణను మే 7న సస్పెండ్ చేస్తూ ఇన్‌ఛార్జి డీఐజీ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఎస్బీలో పని చేసిన సమయంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి కేసులు ఉన్న వారికి పాస్‌పోర్టులు వచ్చేలా చేసిన సిబ్బందిపై మంగళవారం వేటు వేశారు. ప్రస్తుతం భిక్కనూర్ ఏఎస్సైగా పని చేస్తున్న నర్సయ్య, రామారెడ్డి హెడ్ కానిస్టేబుల్ విఠల్ రెడ్డిని సస్పెండ్ చేశారు.

### నిర్లక్ష్యానికి చర్యలు తప్పవు



పోలీసులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి. విధుల్లో నిజాయితీ, క్రమశిక్షణ ఉండాలి. కేసుల విచారణలో జాగ్రత్తగా వ్యవహరించాలి. అలా కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. పోలీసు శాఖకు మచ్చ తెచ్చే విధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించం.

–రాజేష్ చంద్ర, ఎస్పీ

## ఆర్వోబీల పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో మూడు ఆర్వోబీలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని ఎంపీ అర్వింద్ కోరారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్కను హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో ఎంపీ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాకు చెందిన మాధవనగర్, అర్సపల్లి, అడవి మామిడిపల్లి ఆర్వోబీలకు సంబంధించిన బిల్లులు కొన్నినెలలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. పెండింగ్ బిల్లులను సత్వరమే విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

## తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** ప్రజలు తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. బూరుగుపల్లిలో బుధవారం తపాలా కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తపాలా కార్యాలయం ఏర్పాటు చేయడంతో ప్రజలకు తపాలా సేవలు మరింత అందుబాటులోకి వచ్చినట్లయ్యిందన్నారు.

## పాముకాటుతో బాలిక మృతి



**అక్షరటుడే, బాన్సువాడ:** పాముకాటు బారిన పడి బాలిక మృతిచెందింది. ఈ విషాదకర సంఘటన బాన్సువాడ మండలంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. సీఐ తుల శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. పులిగుండు తండా పంచాయతీ పరిధిలోని కాలు నాయక్ తండాకు చెందిన శ్రీకాంత్ కూతురు చౌహాన్ సరస్వతి బుధవారం ఉదయం ఆరు గంటల సమయంలో వాంతులు చేసుకోవడంతో తల్లిదండ్రులు గమనించారు. సరస్వతి కుడికాలిపై పాముకాటు గుర్తులు కనిపించాయి. తక్షణమే కుటుంబ సభ్యులు బాలికను బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక పరీక్ష అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. మార్గమధ్యలో దుర్కి వద్ద బాలిక మృతి చెందినట్లు చెప్పారు. తండ్రి చౌహాన్ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం



**అక్షరటుడే, బోధన్:** వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యమని విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ రాపెల్లి రవీందర్ అన్నారు. చెక్కి క్యాంప్ విద్యుత్ సబ్ స్టేషన్‌కు ప్రత్యామ్నాయ ఇంటర్ లింకింగ్ లైన్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెక్కి క్యాంప్ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు చిన్న పెంట ఫీడర్ నుంచి ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఫీడర్ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రతి సబ్ స్టేషన్‌కు ప్రత్యామ్నాయంగా 33 కేవీ విద్యుత్ సరఫరా లైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే చెక్కి క్యాంపు సబ్ స్టేషన్‌కు రూ.35 లక్షల వ్యయంతో ప్రత్యామ్నాయ ఫీడర్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో బోధన్ డీఈఈ (ఆపరేషన్) ఎండి ముక్తార్, డీఈఈ (కన్‌స్ట్రక్షన్) డి వెంకటరమణ, ఏడీఈ తోట రాజశేఖర్, నగేష్ కుమార్, ఏఈ సుమిత, కళ్యాణ్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## పశు సంవర్ధక శాఖ సేవలు మెరుగుపర్చాలి: కలెక్టర్



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో అందుబాటులో ఉంటూ పశు సంవర్ధక శాఖ సేవలను మరింతగా మెరుగుపర్చాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం పశు సంవర్ధక శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాడి రైతులకు అవసరమైన సేవలు అందించేలా పశు వైద్యాధికారులు అందుబాటులో ఉండాలన్నారు. వెటర్నరీ డాక్టర్లు లేని చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా సర్దుబాటు చేయాలని, మూగజీవాలకు సకాలంలో వైద్య అందేలా చూడాలన్నారు. ఆయా సీజన్లలో పశువులకు సోకే వ్యాధులను నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి అవసరమైన సూచనలు చేయాలని తెలిపారు. మూగ జీవాలకు క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్, వైద్యసేవలు అందేలా పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలన్నారు. గ్రామాల్లో పశు వైద్య శిబిరాలను నిర్వహించడంతో పాటు, సంచార పశు వైద్యవాహనం 1962 ద్వారా చికిత్సలు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ రోహిత్ రెడ్డి, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ తనిఖీ

**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండలకేంద్రంలోని మంజీర అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను సివిల్ సప్లయ్ డీటీ హన్మాండ్లు బుధవారం తనిఖీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోతంగల్ మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉండడంతో మహారాష్ట్ర నుంచి ధాన్యం తెలంగాణలోకి రాకుండా నిఘా ఉంచాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖ, పోలీస్ సిబ్బందిని సూచించారు. చెక్‌పోస్ట్ తనిఖీ చేసి అక్కడ ఉన్న వసతులు, సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. మహారాష్ట్ర నుంచి ధాన్యం రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఏఈవో శంకర్, మల్కన, సుధాకర్, శ్రీనివాస్, విఠల్, షేక్ హైమద్, నర్సింలు తదితరులున్నారు.









## రక్తదానం మహాదానం..

**అక్షరటుడే, ఆర్మూర్:** రక్తదానం మహాదానమని.. ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సీపీ సాయిచైతన్య సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆర్మూర్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన బుధవారం సందర్శించారు. రక్తదానం చేసిన యువకులు, పోలీసులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ రోజుల్లో రక్తదానం అత్యవసరమైందన్నారు. ఒకరి రక్తదానం మరొకరి ప్రాణాలను నిలబెడుతుందన్నారు. పోలీసుల చేసిన త్యాగాలను స్మరించుకునేందుకు వారంరోజుల పాటు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. యువత పెద్ద ఎత్తున రక్తదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

**అక్షరటుడే, కామారెడ్డి :** ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్పీ.. రక్తదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 21 నుంచి 31 వరకు పోలీస్ అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. తనతో పాటు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదాన శిబిరంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రక్తదాన శిబిరం ద్వారా 195 యూనిట్ల రక్తం రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేశామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, సీఐలు, ఎస్సైలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్న, విద్యార్థులు, కళాశాలల యజమాన్యాలు తదితరులు పాల్గొన్నారు.

## సంతకాలు ఫోర్జరీ చేసిన ఉపాధ్యాయుడిని తొలగించాలి




**అక్షరటుడే, కామారెడ్డి:** విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడమే కాకుండా ఫోర్జరీ సంతకాలతో హాజరు వేసుకుని జీతభత్యాలు పొందుతున్న టీచర్‌ను తొలగించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు కామారెడ్డి పట్టణంలో విద్యాశాఖ కార్యాలయంలో సంఘాల ప్రతినిధులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. రాజంపేట మండలం ఆరెపల్లి తండా ప్రైమరీ పాఠశాలలో ఎస్జీటీ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంతో డీఈవో 2024 ఫిబ్రవరి 13న సస్పెండ్ చేశారన్నారు. సుమారు రెండునెలల తర్వాత మళ్లీ విధుల్లోకి తీసుకున్నారని, దీనిని అదనుగా చేసుకొని ఆ ఉపాధ్యాయుడు తప్పుడు హాజరు పత్రాలని సృష్టించి సంతకాలను ఫోర్జరీ చేయగా విద్యాశాఖ అధికారులు గుర్తించి 2025 ఆగస్టు 12న మళ్లీ సస్పెండ్ చేశారన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** రక్తదానం ప్రాణదానంతో సమానమని సీఐ రాజా రెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ముత్యపు రాఘవుల ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి డివిజన్ పోలీస్ సిబ్బంది, సీఐ రాజారెడ్డి, ఎస్సైలు, ప్రజా ప్రతినిధులు, యువకులు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో గాయపడి చికిత్స సమయంలో ఎంతోమందికి సకాలంలో రక్తం అందక మృత్యువాత పడుతున్నారన్నారు. యువత సన్మార్గంలో నడిచి రక్తదానం చేసి మరెందరికో ప్రాణదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, లింగంపేట్, గాంధారి ఎస్సైలు బొజ్జ మహేష్, భార్గవ్, ఆంజనేయులు, ఎల్లారెడ్డి మున్సిపల్ మాజీ ఛైర్మన్ పద్మ శ్రీకాంత్, కుర్మ సాయిబాబా, దీపక్ కుమార్, రెడ్ క్రాస్ సొసైటీ డివిజన్ జనరల్ సెక్రెటరీ జోషి శ్రీధర్, మండల ఛైర్మన్ జనార్దన్ రెడ్డి, రెడ్ క్రాస్ రామకృష్ణ పాల్గొన్నారు.

## పీహెచ్‌డీ సాధించిన ఉపాధ్యాయుడు




**అక్షరటుడే, కామారెడ్డి:** రామారెడ్డి మండలం పోసానిపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మహమ్మద్ షకీల్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ హిందీలో గోల్డ్ మెడల్ సాధించారు. తర్వాత మౌలానా ఆజాద్ కేంద్రీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఎంఫిల్ చేశారు. 2012లో హిందీ స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని సాధించి తన చదువును ఆపకుండా ముందుకు సాగారు. ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి హిందీలో పీహెచ్‌డీ పట్టా సాధించారు. విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ హిందీ విభాధ్యక్షురాలు ప్రొఫెసర్ మాయదేవి మార్గదర్శకత్వంలో ఆయన డాక్టరేట్ పూర్తి చేశారు.

## అవయవ దానం గొప్పది




**అక్షరటుడే, ఆర్మూర్:** అవయవ దానం చేయడం గొప్ప విషయమని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. డొంకేశ్వర్ మండలం గంగ సముందర్ గ్రామానికి చెందిన సాయవ్వ మంగళవారం మృతి చెందారు. దీంతో బుధవారం ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సాయవ్వ మరణించినా.. తన అవయవదానంతో మరో నలుగురి జీవితాల్లో వెలుగు నింపిందన్నారు. అనంతరం డొంకేశ్వర్‌లోనే మరికొన్ని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు చిన్నరెడ్డి, సంతోష్ రెడ్డి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో మేక మృతి

**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో విద్యుత్ ఎర్తింగ్ వైర్ తగిలి ఓ మేక మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. బస్టాండ్ ఎదురుగా గల కాలనీలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఎర్తింగ్ వైర్ తగిలి మేక షాక్ కొట్టి మృతి చెందింది. ట్రాన్స్ ఫార్మర్ వద్ద వైర్ ప్రమాదకరంగా మారిందని, కాలనీలోని చిన్నపిల్లలు నిత్యం ఆడుకుంటారని స్థానికులు చెప్పారు. విద్యుత్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఘనంగా ధ్వజారోహణం



స్వామి వారి ఉత్సవ మూర్తులు



ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

**అక్షరటుడే, భీమ్‌గల్:** భీమ్‌గల్ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా లింబాద్రి గుట్ట గోవింద నామస్మరణతో మార్మోగింది. భక్తిశ్రద్ధలతో బుధవారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ మండలంలో గరుడ పతంపై స్వామివారి ఉత్సవ మూర్తుల ఎదుట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టువస్త్రంపై హోమపూజ నిర్వహించి సప్తదశ కలశ స్థాపన, శోడసోపచారముల పద్ధతితో కలశంలోని జలంతో అభిషేకాలు నిర్వహించి అర్చకులు ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. చతుర్విధమైన అన్నాన్ని నైవేద్యంగా గరుడ్మంతుడికి ముద్దలుగా చేసి ధ్వజారోహణం అనంతరం వీటిని అందజేశారు. ఈ సందర్భంగా మహిళల మంగళహారతుల మధ్య స్వామివారికి శాస్త్రోక్తంగా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా.. గురువారం కుష్మాండ నవమి, స్వామివారి ఎదుర్కోలు కార్యక్రమాలు నిర్వహించనునట్లు ఆలయ ధర్మకర్త నంబి పార్థసారథి తెలిపారు. బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా నిర్మల్, ఆదిలాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు కల్గకుండా అధికారులు, నిర్వాహకులు చర్యలు చేపట్టారు.

## అమ్మవారికి ఒడిబియ్యం సమర్పణ



**అక్షరటుడే, భిక్కనూరు:** మండల కేంద్రంలోని వాసవీమాత ఆలయంలో బుధవారం భిక్కనూరు ఆర్యవైశ్య మహిళా కిట్టి ఆధ్వర్యంలో అమ్మవారికి ఒడి బియ్యం సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాసవీమాతకు ఒడిబియ్యం పోసి.. కట్నకానుకలను సమర్పించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్తీకమాసం సందర్భంగా ఆలయాన్ని దీపాలతో అలంకరించారు. ఆ తర్వాత కార్తీక భోజనాల కార్యక్రమం నిర్వహించారు.

## గుంతలమయంగా పెర్కిట్–మెట్‌పల్లి రహదారి



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** పెర్కిట్ నుంచి మెట్‌పల్లి మీదుగా 63వ జాతీయ రహదారిపై ప్రయాణం ఇబ్బందికరంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ రహదారిపై ప్రతినిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని పేర్కొంటున్నారు. వర్షాల కారణంగా రోడ్డు మొత్తం గుంతలతో నిండిపోగా.. ఈదురుగాలులతో చెట్లు, పిచ్చిమొక్కలు రోడ్డుపైకి వచ్చి ఎదురుగా వచ్చే వాహనాలను కనిపించట్లేదని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని అయినప్పటికీ ఆర్అండ్‌బీ శాఖాధికారులు కనీసం ఈ రహదారి వైపు కన్నెత్తి చూడడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## అక్రమంగా కలప తరలిస్తున్న వాహనం సీజ్



**అక్షరటుడే, ఇందల్వాయి:** అనుమతి లేకుండా అక్రమంగా టేకు దుంగలను తరలిస్తున్న టాటా సుమో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఆర్ఓ రవి మోహన్ భట్ తెలిపారు. అటవీశాఖ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో ఇందల్వాయి రేంజ్ పరిధిలోని ధర్పల్లి మండలం రామడుగు శివారులో వాహనంలో టేకు దుంగలు తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు టేకు దుంగలను స్వాధీనం చేసుకుని, వాహనాన్ని ఇందల్వాయి అటవీ శాఖ కార్యాలయానికి తరలించిన్లు పేర్కొన్నారు. పట్టా భూమి నుంచి కలపను తరలించాలన్నా.. అటవీ శాఖ అనుమతి ఉండాలన్నారు. అనుమతి లేకుండా అక్రమంగా కలప తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎఫ్ఆర్వో తుకారాం రాథోడ్, అటవీశాఖ సిబ్బంది అబ్దుల్ అతీక్, భాస్కర్, నవీన్ రాజ్, ఖదీర్, ప్రవీణ్, ఉదయ్ ఉన్నారు.

## బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి గడ్డ.. ఉద్యమాల అడ్డా అని.. ఇక్కడి నుంచే బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీసీ జేఏసీ ప్రకటించింది. పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో బుధవారం బీసీ జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. నాయకులు మాట్లాడుతూ.. ఈనెల 18న జరిగిన బీసీ జేఏసీ బంద్ విజయంలో సమిష్టి కృషి ఉందన్నారు. ఈ బంద్ విజయం స్ఫూర్తితో త్వరలో నిరంతర కార్యాచరణ రూపొందిస్తున్నామని.. కామారెడ్డి గడ్డ నుంచి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా 9వ షెడ్యూల్‌లో చేర్చే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. బహుజన రాజ్యాధికారమే ధ్యేయంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల నుంచి అసెంబ్లీ, పార్లమెంట్ వరకు, అదేవిధంగా విద్య, ఉద్యోగ రంగాల్లో కూడా బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానం చేశామన్నారు. నాయకులు సాప శివరాములు, నీల నాగరాజు, కుంబాల లక్ష్మణ్ యాదవ్, ఎంజీ వేణు గోపాల్ గౌడ్, నునావత్ గణేశ్ నాయక్, క్యాతం సిద్ధరాములు, వెంకట్ గౌడ్, మర్కంటి భూమన్న, చింతల శంకర్, రాజన్న పాల్గొన్నారు.





## మొంథా తుపాన్ ఎఫెక్ట్.. వర్షానికి పంట నష్టం

**అక్షరటుడే, డిచ్‌పల్లి :** వర్షాలకు రైతన్న ఆగమైపోతున్నాడు. కళ్లెదుటే ఆరుగాలం శ్రమించిన పంట తడిసిపోతుంటే ఆందోళన చెందుతున్నాడు. డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లిలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాలు, రోడ్లపై ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. వర్షాల కారణంగా పంట పూర్తిగా తడిసిపోవడంతో పెట్టుబడి సైతం అందని పరిస్థితిలో ఉన్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొని తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేనందున ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. మొంథా తుపాన్ ఎఫెక్ట్ మరో రెండురోజులు ఉందని.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సౌకర్యాలు లేవని వారు వాపోయారు. తడిసిన ధాన్యాన్ని చూసి కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

## పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి




**అక్షరటుడే, కామారెడ్డి:** నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలు విడుదల చేయకపోవటం వల్ల కళాశాలల్లో విద్యార్థుల సర్టిఫికెట్స్ ఇవ్వటం లేదన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలానికి చెందిన బండారి అశోక్ ఇటీవల మృతి చెందారు. దీంతో వేల్పూర్ హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మేరకు బుధవారం బండారి అశోక్ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలతో జరిగే నష్టాలపై అవగాహన




**అక్షరటుడే, కోటగిరి:** బాల్యవివాహాలతో కలిగే నష్టాలపై బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ,ఎంపీడీవో కార్యాలయాల్లో సదస్సులు ఏర్పాటుచేశారు. అలాగే పోతంగల్ మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, వివిధశాఖల అధికారులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా బాలరక్షక్ కమిటీ సభ్యులు సాయిలు, డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ స్వప్న మాట్లాడుతూ 2006లో బాల్య వివాహ నిషేధ చట్టాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టారన్నారు. ఈచట్టం ప్రకారం బాలుడికి వయసు 21ఏళ్లు, బాలికకు వయసు 18ఏళ్లు నిండకుండా వివాహం జరిగితే అది చట్ట ప్రకారం నేరమవుతుందని పేర్కొన్నారు. బాల్య వివాహలు చేస్తే జైలు శిక్ష, జరిమానా విధిస్తారని చెప్పారు.

## బాలలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిది



**అక్షరటుడే, భీమ్‌గల్ :** బాలలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వేల్పూర్ ఎంపీడీవో బాలకిషన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన బాల్య వివాహాల నిర్మూలన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై వివరించారు. బాలల అక్రమ రవాణా, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాలల చట్టాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సిబ్బంది గణేష్, సౌమ్య, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.